
అడుగడుగునా అడ్డంకులే..

- కుభీర్‌లో ఇళ్ల మధ్యనే విద్యుత్‌లైన్
- తరచూగా కాలనీలో ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- రోడ్డుమార్గం వైపు లైన్‌ను తరలించాలని స్థానికుల వేడుకోలు


కొత్తగా లైన్ వేయాల్సిన రోడ్డు మార్గం


కుభీర్‌లోని కొత్తకాలనీలో ఇళ్ల మధ్యనే విద్యుత్ తీగలు

కుభీర్: మండల కేంద్రంలోని కొత్తకాలనీలో ఇళ్ల మధ్య నుంచే 11కేవీ విద్యుత్ లైన్ ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు తొలగించి రోడ్డు గుండా విద్యుత్ లైన్ వేయాలని అధికారులు, పాలకులకు వినతిపత్రం సమర్పిస్తున్నా.. సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.

1990లో కాలనీ ఏర్పాటు..

1990లో అప్పటి ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో పలువురు ఇళ్లు నిర్మించుకోవడంతో కొత్తకాలనీ ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడ 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీ ఏర్పడక ముందే ఇక్కడ పంట చేన్లకు కరెంట్ సరఫరా చేసే 11కేవీ విద్యుత్ లైన్ ఉంది. 2012 మే 27న విద్యుత్ తీగలు ఒకదాని కొకటి తగిలి మంటలు చేలరేగాయి. దీంతో ఆరు ఇళ్లు పూర్తిగా ఖాళీపోగా.. లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది. అప్పటినుంచి తమ కాలనీ నుంచి విద్యుత్ లైన్ తొలగించాలని పాలకులను కలిసి వేడుకుంటూ ఉన్నారు. స్పందించిన ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి కాలనీ నుంచి లైన్ తొలగించి రోడ్డు మార్గం గుండా కాలనీకి కరెంట్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వారు సర్వే చేసి విద్యుత్ లైన్ మార్పిడికి రూ.మూడు లక్షలు మంజూరు చేశారు.

విఠలేశ్వర మందిరం నుంచి సబ్‌స్టేషన్ వరకు లైన్ ఏర్పాటుకు నిర్ణయం..

ఇళ్లపై నుంచి కాకుండా గ్రామంలో ప్రధాన రోడ్డు గుండా స్థానిక విఠలేశ్వర మందిరం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు వేయాలని నిర్ణయించారు. కానీ ఇక్కడున్న వారు అడ్డుకోవడంతో మళ్లీ పనులు ఆగిపోయాయి. మందిరం వైపు నుంచి వేయాలని మందిరం కమిటీ వారు అంటుంటే.. మరికొందరు సబ్‌స్టేషన్ వైపు నుంచి లైన్ వేసుకుంటూ రావాలని వాదించారు. కొందరు రోడ్డుకు అటువైపు అంటే.. కొందరు ఇటువైపు వేయాలని గ్రామస్తులు అడ్డుకోవడంతో విద్యుత్తు అధికారులు పనులు నిలిపివేశారు. లైన్ మార్చేందుకు తీసుకొచ్చిన స్తంభాలను విద్యుత్ అధికారులు మరో చోటకు తరలించారు.

సమస్య పరిష్కరించాలని డిమాండ్..

గ్రామస్తులు, గ్రామపెద్దలు, విద్యుత్ అధికారులు ఓ పరిష్కార మార్గాన్ని కనుగొని త్వరగా లైన్ రోడ్డు వైపునకు మార్చాలని కాలనీవాసులు పేర్కొంటున్నారు. కొత్త కాలనీలో విద్యుత్ తీగలు ఇళ్ల మీదుగా ఉండటంతో కొత్తగా ఇళ్లు కట్టుకునేవారికి ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి విద్యుత్ లైన్‌ను రోడ్డువైపు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదంలో సర్వం కోల్పోయాం



2012లో 11కేవీ విద్యుత్ లైన్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయాం. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు పరుగెత్తాం. మా ఇల్లు.. వస్తువులు ఏం మిగలకుండా మొత్తం ఖాళీ పోయాయి. మళ్లీ అప్పు చేసి ఇల్లు కట్టుకున్నాం. త్వరగా విద్యుత్ లైన్‌ను తరలించాలి.

– రవి, కుభీర్

అప్పటి నుంచి భయపడుతున్నాం



అప్పుడు జరిగిన ప్రమాదంలో మా పశువుల పాక, పనిముట్లు ఖాళీపోయాయి. ప్రభుత్వం సాయం చేయలేదు. అప్పటి ఎమ్మెల్యే వేణుగోపాలచారి ఒక్కో కుటుంబానికి రూ.1500 అందించారు. అప్పటి నుంచి అందరం భయపడుతున్నాం. ప్రభుత్వం లైన్‌మార్పిడి చేయాలి.

– ఎనుపోతుల పిరాజీ, కుభీర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం

రోడ్డు గుండా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసేందుకు పంచాయతీ తీర్మానించింది. స్తంభాలు వచ్చిన మాట వాస్తవం. త్వరలోనే విద్యుత్ లైన్‌మార్పిడి పనులు ప్రారంభిస్తాం.

– అజీజొద్దీన్, విద్యుత్తు ఏఈ, కుభీర్

వైభవంగా గ్రామదేవతలకు చలిబోనాలు


లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో ఆలయం వద్ద భక్తులు


లోకేశ్వరం: నగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


మామడ: పొన్కల్‌లో బోనాలతో మహిళలు

ఖానాపూర్: పుష్య అమావాస్య నుంచి మాఘశుద్ధ పౌర్ణమి వరకు జరిగే చలిబోనాల పండుగను ప్రతి ఆది, గురువారాల్లో గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. పట్టణంలోని శాంతినగర్ కాలనీ ముత్యాల పోచమ్మతల్లికి ఆదివారం చలిబోనాలు సమర్పించారు. వివిధ కాలనీల మహిళలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శరత్‌చంద్రశర్మ, నందకుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక తీర్థప్రసాదం అందజేశారు.

సారంగపూర్: మండలంలోని జామ్, బోరిగాం, ఆలూరు, ధని, సారంగపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతల బోనాల పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా ముత్యాలమ్మ, పోచమ్మ, మహాలక్ష్మీ ఆలయాల్లో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మతల్లికి చలిబోనాలు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి, రాచాపూర్, లక్ష్మణచాంద, ధర్మారం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు చలిబోనాలు సమర్పించారు. ఆయా గ్రామాల్లో ఉదయం గోదావరి నీళ్లతో గ్రామ దేవతల ప్రతిమలకు అభిషేకం నిర్వహించారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామంలో ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. ఇంటికో బోనంతో వచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. మండల కేంద్రంలోనూ గ్రామదేవతలకు పూజలు చేశారు. సర్పంచ్ శారద, వైస్ ఎంపీపీ మామిడి నారాయణరెడ్డి, వీడీసీ సభ్యులు ఆజోబ పటేల్, భోజన్న, భోజారెడ్డి పాల్గొన్నారు. లోకేశ్వరంమండలంలోని నగర్ గ్రామంలోని రేణుక ఎల్లమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచోపనిషత్తులతో అభిషేకం చేసి కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.


పెంబి: మందపల్లిలో నైవేద్యం సమర్పిస్తూ..

మామడ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలకు బోనాల పండుగ నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనాథలను ప్రభుత్వమే ఆదుకోవాలి


నినాదాలు చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అనాథ పిల్లలను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్ మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.అనాథ పిల్లల పరిస్థితి దయనీయంగా ఉందని.. వారి సమస్యలకు సీఎం కేసీఆర్ పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ బర్ల రాజకుమార్ మాదిగ, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భానోత్ గోవింద్‌నాయక్, దివ్యాంగుల సంఘం నాయకులు సట్టి సాయన్న, మహాజన సోషల్ పార్టీ నిర్మల్ మండలాధ్యక్షులు రవి, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్


మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

నిర్మల్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల చట్టాల రక్షణ, నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయించాలనీ, పని దినాలు 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ఫిబ్రవరి 6న కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో దాదేమియా, రాజమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.గంగామణి, జిల్లా సహాయ కార్యదర్శి శైలజ, రాజియా, ఎన్.నర్సయ్య, డి.పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు

హరినామ సప్తాహం ప్రారంభం

తానూర్: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో ఆదివారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాథ భజన, రాత్రి కీర్తన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా భాస్కర్ మహారాజ్ పలు ప్రవచనాలు చెప్పారు. యువత తులసీమాల ధరించి చెడు వ్యసనాలకు దూరం ఉండాలన్నారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల వార్కరి భక్తులు హాజరయ్యారు. సప్తాహ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: మండలంలోని ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో మహాలక్ష్మీ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి మాట్లాడారు. దేవాదాయ శాఖ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసి ఆలయం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29న బుద్ధుడి విగ్రహావిష్కరణకు సంబంధించిన బుద్ధవిహార్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేశ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సాయారెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్తా ధర రూ.270 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలపై అభ్యంతరాలు


ఎఫ్ఆర్వోతో మాట్లాడుతున్న గ్రామస్తులు

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే రేఖానాయక్ పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. రాంపూర్, మైసంపేట్ వాసులు ఆదివారం ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి అభ్యంతరా లు వ్యక్తం చేశారు. చెప్పిన విధంగా కా క 20/23 సైజులో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని.. మాకు చెప్పిన 25/30 సైజులోనే ఇళ్లు నిర్మించాలని ఎఫ్ఆర్వో అనితకు తేల్చి చెప్పారు.

పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: క్రిష్ణవర్మ ఆర్ట్స్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించిన షార్ట్ ఫిలిం ముఖ్యోద్దేశం రిపబ్లిక్ డే గొప్పతనం చాటడమేనని నటీనటులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో అల్లోల మురళీధర్‌రెడ్డి వారి చేతుల మీదుగా తన నివాసంలో చిత్ర పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జున్ను అనిల్, పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం


ముధోల్: మండల కేంద్రంలో ఆదివారం బీసీ సంఘం ముధోల్ గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంజాల నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఆనంద్‌పటేల్, ప్రధాన కార్యదర్శిగా నారాయణ, కోశాధికారిగా మేత్రి సాయినాథ్, సహాయ కార్యదర్శిగా పెద్ద కర్రోల మోహన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో మున్నూర్‌కాపు సంఘం తాలూకా అధ్యక్షులు రోళ్ల రమేశ్ పాల్గొన్నారు.

మంత్రి సోదరుల విరాళం


విరాళం అందిస్తున్న సురేందర్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో శ్రీ వరసిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవం ఈనెల 25న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఐకేరెడ్డి సోదరులు అల్లోల మురళీధర్‌రెడ్డి రూ.25వేలు, బీఆర్ఎస్ లక్ష్మణచాంద మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి రూ.10వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సురేందర్‌రెడ్డి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో చింతల్‌చాంద ఉపసర్పంచ్ అశోక్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, నరేందర్, సాయన్న పాల్గొన్నారు.

మైనంపల్లి హన్మంతరావుకు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు

భైంసా: మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదివారం బాసరకు వచ్చారు. బాసర మాజీ సర్పంచ్ మమ్మాయి రమేశ్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వచ్చి పలు విషయాలు చర్చించారు. అనంతరం వారిని సత్కరించారు. జెడ్పీటీసీ వసంత రమేశ్, సురేశ్, సుజిత్‌రావ్, సాయిలు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంత పూడ్చండి సారూ..



తానూరు: తానూరు-ముధోల్ వెళ్లే మార్గంలో సింగ్‌గాం శివారులో రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రాత్రి గుంత కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంత పూడ్చి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: కొండయ్య, ఆర్అండ్‌బీ డీఈ, ఫోన్:9666331486

సామూహిక కుంకుమార్చనలు


కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివసాయి సమాజ్ సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు శశిధర్ శర్మ, మల్లేశ్ బృందం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. విశేష సంకల్పం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, ఆచార్య రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు క్షేత్రపాలక చతుషష్టి సహిత సర్వతోభద్ర మండల సహిత, శ్రీచండీ దేవతా స్థాపన శ్రీలక్షి గణపతి పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు రాజేందర్, సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం


విగ్రహాలను తీసుకెళ్తున్న ఎంపీపీ పద్మ దంపతులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం ఉత్సవ విగ్రహాల ఎదుర్కోలు, ఆలయ ప్రవేశం, శ్రీ మహా గణపతిపూజ, స్వస్తివచనం, పంచగవ్య, రక్షాబంధనం, అఖండ దీపస్థాపన, నవగ్రహ పూజ, మూల మంత్ర హోమాలు, పూర్ణాహుతి, మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

విగ్రహాలు అందించిన ఎంపీపీ పద్మ దంపతులు..

రూ.45వేల విలువైన శివపార్వతుల విగ్రహాలను ఎంపీపీ పద్మ రమేశ్ దంపతులు, నాగేంద్రుడు విగ్రహాన్ని రాము, కిరీటాలను గాండ్ల నవీన్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్,అడ్వాల రమేశ్, ఆలయ కమిటీ సభ్యులు రాజు, ఈటెల శ్రీనివాస్, ఓస మల్లు, రాహుల్, ఓస రవి, నరేందర్, రవీందర్, పూజారులు సందీప్‌శర్మ, ప్రహ్లాదశర్మ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఏపీపీ పూజలు


వినోద్‌రావును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందజేశారు. వారి వెంట గవర్నమెంట్ ప్లీడర్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, పోక్సో కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి, సబ్‌కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంకం రాజేందర్, అర్చకులు శశిధర్‌శర్మ, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, పుప్పాల శంకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఈరోజు

'స్వేచ్ఛ జేఏసీ' విజయవంతం చేయాలి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే స్వేచ్ఛ జేఏసీని విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. నిర్మల్ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఉదయం 12 గంటలకు స్వేచ్ఛ ప్రకటనపై శాంతియుత మానవహారం నిర్వహిసస్తామని.. అన్ని సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు వెంకటస్వామి, బుద్ధవిహార్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, గోవింద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం

ఖానాపూర్: పట్టణంలోని వాసవీమాత ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు ఎం.జితేందర్ తెలిపారు. ఆలయంలో చండీహోమం, పూజలతోపాటు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామంలో నిర్మించిన మార్కండేయ మహర్షి ఆలయ 20వ వార్షికోత్సవం సోమవారం పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు వచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు పోటీలు

ఖానాపూర్: రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని పట్టణానికే చెందిన కానిస్టేబుల్ కె.సాగర్ ఆదివారం ఏఆర్ఎస్ కళాశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు భారత రాజ్యాంగంపై ఆబ్జెక్టివ్ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు, తృతీయ బహుమతి రూ.1500లను 26న అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రిన్సిపాల్ రమేశ్‌నాయక్, పీఈటీ రాజభూషణ్, నిర్వాహకులు జీవన్, సంపత్, కిరణ్ ఉన్నారు.

'పార్కింగ్‌కు లీజుకివ్వలేదు'

భైంసా: బాసర గోదావరి నది వద్ద ప్రైవేట్ వాహనాల పార్కింగ్ కోసం ఇతరులకు లీజుకిచ్చామని కొందరు ఆరోపణలు చేస్తున్నారని.. తమ సొంత స్థలమే వేరే వారికి లీజుకు ఇచ్చామని సర్పంచ్ లక్ష్మణ్‌రావ్ తెలిపారు. అభివృద్ధిని ఓర్వలేక బీజేపీ నాయకులు కావాలని అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఆలయాల్లో పూజలు

కుంటాల: కుంటాల ఇళవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీమద్భగవద్గీత ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో ఆదివారం శ్రీమద్భగవద్గీత ప్రారంభించారు. బాపూజీ మహారాజ్ ఆలయ ప్రాంగణంలో ఈనెల 29 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విజయవంతం చేయండి

కుంటాల : కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ ఆలయ మూడో వార్షికోత్సవం ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 11 రోజులపాటు గజ్జలమ్మ దీక్ష మాలలు ప్రారంభం అవుతాయన్నారు. దీక్షను చేపట్టే వారు ఎల్లమల శంకర్, హోమంలో పాల్గొనే భక్తులు దంపతులు జక్కని గజేందర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల : కుంటాల ఎస్సైగా సాయికిరణ్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. కాగా ఆదివారం బీజేపీ నాయకులు వారిని సన్మానించారు. బీజేపీ మండల కన్వీనర్ నర్సయ్య, వైస్‌ఎంపీపీ మానిక నవీన్, ఎంపీటీసీ కట్ట రవి, నాయకులు గజేందర్, సత్తయ్య, తాటి శివ, శ్రావణ్, సాయికుమార్ ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహం

భైంసా: బాసర మండలం ఓని గ్రామంలో నాలుగు రోజులుగా సప్తాహం కొనసాగుతుంది. మాధవ్ మహారాజ్ భక్తులను ఉద్దేశించి కీర్తనలు చేశారు. చెడు వ్యసనాలకు దూరం ఉండాలని సూచించారు.